పోచారం కాంగ్రెస్‌లో చేరడం

అవకాశవాద రాజకీయం

ఇలాంటివి నేను ప్రోత్సహించను

ఇతరులను చేర్చుకోవాల్సిన అవసరం లేదు: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, జూన్ 22 : మాజీ స్పీకర్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడం అవకాశవాద రాజకీయమని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో 65 మంది ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ ప్రభుత్వం సుస్థిరంగా ఉన్నదని, ఇతర పార్టీల నాయకులను చేర్చుకోవాల్సిన అవసరం ఉందని తాను భావించడం లేదని తెలిపారు. ఇలాంటి వాటిని తాను వ్యక్తిగతంగా ప్రోత్సహించనని స్పష్టంచేశారు. శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో విప్ అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు పైవిధంగా స్పందించారు. ఏ రాజకీయ పార్టీ అయినా సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయాల్సి ఉంటుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అన్ని వర్గాల సంక్షేమం కోసం పథకాలు అమలు చేస్తున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడమే కాకుండా ప్రజా అవసరాలు దృష్టిలో ఉంచుకొని పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు.

తట్టెడు మన్ను తవ్వనీయలే

- కేంద్ర బీజేపీ సర్కార్ గనులు కేటాయించినా.. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అడ్డుకున్నది
- అదీ తెలంగాణ పట్ల మా కమిట్‌మెంట్
- ఇప్పటికే జలవనరులు తాకట్టు
- అదేదారిలో సింగరేణి ప్రైవేట్‌కు కుట్ర
- రేవంత్ వ్యాఖ్యలపై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సింగరేణి గనులను ప్రైవేటుపరం చేసినా సంస్థ ప్రయోజనాలే తమకు ప్రాణసమానమని భావించి నాటి ప్రభుత్వం తట్టెడు మట్టిని కూడా తవ్వనీయలేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రయోజనాలు, రక్షణ విషయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించి, ప్రత్యక్ష పోరాటాలు చేసిన సందర్భాలను ఆయన శనివారం ఒక ప్రకటనలో గుర్తుచేశారు. సింగరేణి గనుల వేలంపై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను కేటీఆర్ ఖండించారు. రేవంత్, ఆయన ప్రభుత్వం చేస్తున్న అబద్ధాల ప్రచారం చూసి గోబెల్స్ కూడా తన సమాధిలోనే తలదించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజల 60 ఏండ్ల ఆకాంక్షలను అర్థం చేసుకొని పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్న పార్టీ తమదని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను వినకుండా, వాటిని క్రూరంగా అణిచి, వేల మందిని చంపింది కాంగ్రెస్ పార్టీ అనే విషయం యావత్ సమాజానికి తెలుసునని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి గద్దెపై రేవంత్ ఎక్కిన తర్వాత కాంగ్రెస్, బీజేపీ కలిసి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్న తీరును ప్రతి తెలంగాణ పౌరుడు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

గనుల అమ్మకానికి ఎన్నడూ ఒప్పుకోలేదు

సింగరేణి ప్రయోజనాల కోసం బీఆర్‌ఎస్ పార్టీ నిలబడటం వల్లనే.. వేలంలో గనులను దక్కించుకున్న రెండు కంపెనీలు మైనింగ్ ప్రారంభించలేదనే విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. కేంద్రంలోని బీజేపీ గనులను కేటాయించినా కేవలం తమ ప్రభుత్వ కఠిన వైఖరి, నిబద్ధత వల్లనే ఆ కంపెనీలు సింగరేణి బొగ్గును తవ్వలేకపోయాయని తెలిపారు. రేవంత్ పేర్కొన్న రెండు కంపెనీలు మహారాష్ట్రలో కాంగ్రెస్, శివసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో టాక్లీ, జెన, బెల్లోర గనులను దక్కించుకున్న విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణలో బొగ్గు గనుల అమ్మకానికి ఎన్నడూ సమర్థించలేదని, అందుకే తమ ప్రభుత్వం ఏ రోజు వేలంలో పాల్గొనలేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నిసిగ్గుగా వేలంలో పాల్గొని తెలంగాణ ప్రయోజనాలను దెబ్బ కొడుతున్నదని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజల హక్కులను, ఆస్తులను, వనరులను తాకట్టు పెట్టడంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు తోడుదొంగల్లా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికే నదీ జలాల వాటాను వదులుకున్న కాంగ్రెస్ తీరును రాష్ట్ర ప్రజలు గుర్తించాలని అన్నారు. తాజాగా బీజేపీకి రేవంత్‌రెడ్డి సర్కారు అందిస్తున్న సహకారంతో సింగరేణి సంస్థను ప్రైవేటుపరం చేసే కుట్రలు తెలిసిపోతున్నాయని పేర్కొన్నారు. గనుల వేలంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని తెలంగాణ చరిత్ర క్షమించదని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్, బీజేపీ రెండు జాతీయ పార్టీలు చేస్తున్న ద్రోహానికి ప్రజలు సరైన సమయంలో గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

అమెరికాలో జరిగిన కార్యక్రమంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

పార్టీ మారాలని ప్రభుత్వం ఒత్తిడి

- నాతోపాటు భార్య, కొడుకుపైనా కేసులు
- ఆరు నెలల్లో నాలుగైదు కేసులు
- పార్టీ మారే ప్రసక్తే లేదు
- జనగామ ఎమ్మెల్యే పల్లా ఫైర్
- అమెరికాలోని వర్జీనియాలో మీట్ అండ్ గ్రీట్

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): పార్టీ మారాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వం తనపై ఒత్తిడి తెస్తున్నదని బీఆర్‌ఎస్ నేత, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. వేధింపుల్లో భాగంగా ఆరు నెలల్లోనే నాలుగైదు కేసులు నమోదుచేశారని, తనతోపాటు తన భార్య నీలిమ, కొడుకు అనురాగ్‌పైనా కేసులు పెట్టారని తెలిపారు. వాటికి భయపడబోనని, న్యాయపోరాటం చేస్తానని పేర్కొన్నారు. ఉద్యమం నుంచి రాజకీయాల్లోకి వచ్చానని, కేసులు, అరెస్టులు తనకు కొత్త కాదని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీ మారే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. తెలంగాణలో కాంగ్రెస్ నేతలు కక్షపూరిత రాజకీయాలను ప్రారంభించారని, ఇప్పటి వరకు ఇలాంటి వాతావరణం ఇక్కడ లేదని తెలిపారు. అమెరికాలోని వర్జీనియాలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా పాల్గొని ప్రసంగించారు. బీఆర్‌ఎస్‌లోకి రాక ముందు ఉద్యమంలో జేఏసీతో కలిసి పని చేశానని, నాడు ఉమ్మడి పాలకులు కేసులు పెట్టారని, మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాల్లో విలువలు పాటించాలని, గెలిచిన పార్టీ ఐదేండ్లు అధికారంలో ఉండాలని సూచించారు.

అలవికాని హామీలతో అధికారంలోకి

అబద్ధాలు చెప్పి, అలవికాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఈ విషయం ఇప్పటికే ప్రజలకు అర్థమైందని రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్‌కు శ్వాస, ధ్యాస తెలంగాణేనని, తన పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని తలెత్తుకొని నిలబడేలా చేశారని గుర్తుచేశారు. కాళేశ్వరం అద్భుత ప్రాజెక్ట్ అని, నిపుణుల సలహాతోనే దానిని నిర్మించారని తెలిపారు. అవగాహన లేమితో కాళేశ్వరంపై కొందరు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అమెరికా వర్సిటీల నుంచి మనం నేర్చుకోవాల్సింది చాలా ఉన్నదని తెలిపారు. ఇక్కడి వర్సిటీల్లో 30 శాతం మంది విద్యార్థులు భారతీయులేనని చెప్పారు. అందులోనూ తెలుగువాళ్లు అధికంగా ఉన్నారని పేర్కొన్నారు. ఇటు విద్య, అటు ఉద్యోగం విషయాల్లో మన వాళ్లపైనే విదేశీ యూనివర్సిటీలు ఆధార పడుతున్నాయని, ఇది మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. మీట్ అండ్ గ్రీట్‌లో ఆటా ఎలెక్ట్ ప్రెసిడెంట్ జయంత్ చల్లా, ఆటా మాజీ అధ్యక్షుడు భువనేశ్ భుజాల, రామ్మోహన్ కొండ, జీటీపీ చైర్మన్ కలవల విశ్వేశ్వర రెడ్డి, రవి పల్లా, స్థానిక తెలుగు సంఘాలు ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ద్వంద్వ నీతి

మొదటిపేజీ తరువాయి...

సెక్షన్ 2(1)(ఏ) ప్రకారం ఒక పార్టీ నుంచి గెలిచి, ఆ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినప్పుడు అనర్హత వేటుకు పడుతుందని కాంగ్రెస్ నేతలు చెప్తున్నారు. ఈ మేరకు ఆమెపై అనర్హత వేటు వేయాలని సీఎల్పీ నేత అఫ్తాబ్ అహ్మద్, చీఫ్ విప్ బీబీ బత్ర స్పీకర్‌కు లేఖ రాశారు. కాంగ్రెస్ సభ్యత్వాన్ని వదులుకొని బీజేపీలో చేరిన ఆమెకు కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యే పదవిలో కొనసాగే అర్హత లేదని ఈ లేఖలో పేర్కొన్నారు. ఫిరాయింపుల విషయంలో గతంలో కిహోటో హొల్లోహన్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా వీరు ప్రస్తావించారు. ఫిరాయింపుల నిరోధక చట్టంలో అంతర్లీనంగా రీకాల్ చేసే శక్తి ఉంటుందని పేర్కొన్నారు. అనైతిక ఫిరాయింపులను రాజకీయ, సామాజిక దురాచారంగా అభివర్ణించారు.

హర్యానాలో తప్పు.. తెలంగాణలో ఒప్పా ?

హర్యానాలో మరో నాలుగు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో ఎన్నికల సందడి మొదలైంది. దీంతో పార్టీ ఫిరాయింపులు మొదలయ్యాయి. పదవీకాలం దాదాపుగా పూర్తికావొచ్చినప్పటికీ కిరణ్ చౌదరి పార్టీ ఫిరాయింపును కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబడుతున్నది. ఆమెకు ఎమ్మెల్యేగా కొనసాగే అర్హత లేదని అంటున్నది. మరోవైపు ఇటీవలే అసెంబ్లీ ఎన్నికలు జరిగిన తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ తరపున పోటీ చేసి గెలిచిన కొందరు ఎమ్మెల్యేలను పార్టీలోకి చేర్చుకుంటూ ఫిరాయింపులకు కాంగ్రెస్ పార్టీ జై కొడుతున్నది. బీఆర్‌ఎస్ తరపున పోటీచేసి గెలిచిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావును ఇప్పటికే పార్టీలో చేర్చుకున్నది. తాజాగా మరో సీనియర్ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కూడా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హర్యానాలో ఒక్క ఎమ్మెల్యే ఇతర పార్టీలో చేరితే ఫిరాయింపు చట్టాలంటూ గగ్గోలు పెట్టిన కాంగ్రెస్‌కు ఇక్కడ మాత్రం ఎలాంటి ఫిరాయింపు చట్టాలు గుర్తుకు రావడం లేదా? అని ప్రశ్నిస్తున్నారు. లేదంటే, ఆ పార్టీకి తెలంగాణలో ఫిరాయింపు చట్టం వర్తించదా? అంటూ ప్రశ్నలు కురిపిస్తున్నారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ ఇలా రాష్ట్రానికో నీతి పాటించడం, ఊసరవెల్లిలా రంగులు మార్చడం ఏంటనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాహుల్‌గాంధీ ఏం సమాధానం చెబుతారు?

ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల అంశంపై కాంగ్రెస్ ద్వంద్వనీతిని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎండగట్టారు. హర్యానాలో పార్టీ మారిన కాంగ్రెస్ ఎమ్మెల్యేపై వేటు వేయాలంటూ ఆ పార్టీ ఇచ్చిన ఫిర్యాదును ట్విటర్‌లో పోస్ట్ చేసిన కేటీఆర్ ఆ పార్టీ విధానాన్ని ప్రశ్నించారు. అదే సమయంలో తెలంగాణలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను ఆ పార్టీలో చేర్చుకోవడంపై ప్రశ్నించారు. 'హర్యానాలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇతర పార్టీలో చేరితే వరదలు పారేలా ఏడుస్తున్నారు. అదే తెలంగాణలో కాంగ్రెస్‌లోకి ఇతర పార్టీ ఎమ్మెల్యేలు వస్తే విజయోత్సవాలు చేసుకుంటున్నారు. ఇదేం ద్వంద్వ నీతి? రాహుల్‌గాంధీ దీనికి ఏం సమాధానం చెబుతావు' అని ప్రశ్నించారు.

విడాకుల కేసులో భార్య ప్రియుడిని ప్రతివాదిగా చేర్చాలి

కింది కోర్టు ఉత్తర్వులను రద్దు చేస్తూ హైకోర్టు కీలక తీర్పు

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): విడాకులు మంజూరు చేయాలని కోరుతూ ఓ వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌లో అతని భార్య ప్రియుడిని కూడా ప్రతివాదిగా చేర్చాలని హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. తన భార్య ప్రియుడిని ప్రతివాదిగా చేర్చేందుకు కింది కోర్టు నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ ఆ వ్యక్తి దాఖలు చేసిన వ్యాజ్యంపై జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ ఇటీవల విచారణ పూర్తిచేశారు. భార్యకు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉన్నదని ఆరోపిస్తూ భర్త విడాకులు కోరుతున్నప్పుడు అక్రమ సంబంధ ఆరోపణలను ఎదుర్కొనే వ్యక్తి వాదనలను కూడా వినాలని స్పష్టం చేస్తూ.. కింది కోర్టు ఉత్తర్వులను రద్దు చేశారు.

కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

రేపటి నుంచి సమ్మె చేస్తం

కండ్లకు గంతలతో జూనియర్ డాక్టర్ల నిరసనలు

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ)/ బన్సీలాల్‌పేట్/సుల్తాన్‌బజార్: ఈ నెల 24లోగా జూనియర్ డాక్టర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే ఎమర్జెన్సీ మినహా విధులను బహిష్కరిస్తామని జూనియర్ డాక్టర్లు హెచ్చరించారు. తమ సమస్యలు పరిష్కరించాలని శనివారం గాంధీ, ఉస్మానియా దవాఖానలలోని వైద్య కళాశాలల జూనియర్ డాక్టర్లు కండ్లకు గంతలు కట్టుకుని నిరసన ప్రదర్శన నిర్వహించారు. జూనియర్ డాక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ హర్ష, గాంధీ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ వంశీ, ప్రధాన కార్యదర్శి లౌక్య, ఉస్మానియా జూనియర్ డాక్టర్‌ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ దీపాంకర్,ప్రధాన కార్యదర్శి డాక్టర్ చంద్రికా రెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న స్టైఫండ్‌ను తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఏపీ విద్యార్థులకు ఇస్తున్న 15 శాతం రిజర్వేషన్ తొలగించాలని, అవుట్ పోస్ట్‌లో పోలీసుల సంఖ్య పెంచాలని, హాస్టల్ సదుపాయం కల్పించాలని వారు కోరారు. 24 లోగా ప్రభుత్వం స్పందించకపోతే ఎమర్జన్సీ,ఐసీయూ మినహా అన్ని విభాగాలలో విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఇసాక్ న్యూటన్, డాక్టర్ మహేశ్, డాక్టర్ సుచరిత, డాక్టర్ జగన్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల కుతకుత

మొదటిపేజీ తరువాయి...

నాగేశ్వరరావు ఎన్టీఆర్ హయాంలోనే మంత్రిగా పనిచేశారు. ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వైఎస్ హయాంలో డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నారు. మిగిలినవారికి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో మంత్రులుగా పనిచేసిన అపార అనుభవం ఉంది. గతంలో ఏ సీఎం కూడా తమను ఈ రకంగా కట్టడి చేసిన దాఖలాలు లేవని వారు వాపోతున్నారు. ఇలాంటి అవమానకరమైన పరిస్థితులను తాము ఎదుర్కొనలేదని అంటున్నారు. ఈ నిర్ణయం పూర్తిగా సీఎం రేవంత్‌రెడ్డి అనాలోచిత, అనుభవరాహిత్యానికి నిదర్శనమని తప్పుపడుతున్నారు. ప్రభుత్వ నిర్ణయాలు అంటే అది మంత్రిమండలి నిర్ణయంగానే చూస్తారు. మంత్రిమండలి తీసుకునే నిర్ణయాలలో సీఎంకు ఎంతటి బాధ్యత ఉంటుందో మంత్రులకు కూడా అంతే బాధ్యత ఉంటుంది. అలాంటప్పుడు ప్రభుత్వ నిర్ణయాలను వెల్లడించే అధికారం ఇద్దరు మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి మాత్రమే కల్పించడం ఏమిటి? అని ప్రశ్నిస్తున్నారు. జనం దృష్టిలో తమను డమ్మీలుగా చేసి అవమానించడం కాదా? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తమ అనుభవం ముందు ఎంత?

మంత్రులు ఇద్దరిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఉన్న అనుభవం ఏమిటి? మొదటిసారి మంత్రి అయిన ఆయనకు తమపై పెత్తనం అప్పగించడం ఏమిటని సీనియర్ మంత్రులు వాపోతున్నారు. మూప్పై, నలభై ఏండ్ల నుంచి రాజకీయాల్లో ఉన్నాం, గతంలో మంత్రులుగా పనిచేసిన అనుభవం కలిగిన తాము వెళ్లి ఇద్దరు మంత్రులకు తెలియజేయాల్సిన దుస్థితి ఏమిటి? అని ప్రశ్నిస్తున్నారు. సీఎం అనాలోచిత, తమపై కర్ర పెత్తనం చేసే ఆధిపత్య నిర్ణయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి అక్కడే తేల్చుకుంటామని సీనియర్ మంత్రి ఒకరు మండిపడ్డారు. పిల్లొచ్చి గుడ్డును వెక్కిరించినట్టు ఉంది తమ పరిస్థితి అని మరో సీనియర్ మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం తప్ప మంత్రులంతా డమ్మీలేనన్న సంకేతాలు ప్రజలకు ఇచ్చినట్టు అయిందని మండిపడుతున్నారు. సీఎం తీసుకున్న నిర్ణయాన్ని రెండు రకాలుగా చూస్తున్నామని ఒక మంత్రి విశ్లేషించారు. తన సహచర మంత్రులపై సీఎంకు ఏమాత్రం నమ్మకం లేకపోవడం, వారి అనుభవాన్ని గౌరవించకపోవడం ఒకటైతే.. రెండోది ప్రజల దృష్టిలో మంత్రులంతా డమ్మీలన్న అభిప్రాయం కల్పించడమేనని వ్యాఖ్యానించారు.

అంతర్గత ప్రజాస్వామ్యం ఏమైనట్టు?

కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ. తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించడం ఆ పార్టీ నేతలకున్న ప్రత్యేకత. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కుల గణన చేపడుతామని పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన ప్రకటననే ఆ పార్టీ సీనియర్ నేతలు బాహటంగా తప్పుపట్టిన ఉదంతాన్ని ఈ సందర్భంగా సీనియర్ మంత్రి ఒకరు గుర్తుచేశారు. పార్టీ పెద్దలంతా జాతీయ అధ్యక్షునిగా మల్లికార్జున ఖర్గేను బరిలోకి దింపితే, ఆయనపై శశిథరూర్ పోటీకి దిగిన ఉదంతాన్ని ఉటంకించారు. ఈ విధంగా అంతర్గత ప్రజాస్వామ్యం ఉండే కాంగ్రెస్‌లో మంత్రులు ఎవరూ మాట్లాడవద్దనే నిబంధన పార్టీ అధికారంలో ఉన్న మరే రాష్ట్రంలో అయినా ఉందా? అని సీనియర్లు నిలదీస్తున్నారు.

మంత్రుల ముఖాల్లో నెత్తురు చుక్క లేదు

రైతులకు ఒకే దఫా రూ.2 లక్షల రుణ మాఫీ చేయాలని మంత్రిమండలి తీసుకున్న సాహసోపేత నిర్ణయాన్ని మంత్రుల అందరి సమక్షంలో సమిష్టిగా వెల్లడిద్దామని ప్రెస్‌మీట్‌కు వెంటబెట్టుకొచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. వేదికపై అసలు విషయంకంటే, 'ఇక నుంచి ప్రభుత్వ నిర్ణయాలను ఎవరంటే వారు కాకుండా ఇద్దరు మంత్రులు మాత్రమే వెల్లడిస్తారు' అని లైవ్‌లో చెప్పడం సీనియర్ మంత్రులను విస్మయానికి గురి చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ విషయాన్ని మీడియాకు వివరిస్తున్నప్పుడు వేదికపై ఉన్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్ర అసహనానికి గురైన విషయం పాత్రికేయుల కంట పడక పోలేదు. రైతుల రుణ మాఫీపై మంత్రివర్గ నిర్ణయాన్ని వెల్లడించడానికి సీఎంతో పాటు ప్రెస్‌మీట్‌కు ఉత్సాహంగా వచ్చిన మంత్రులు సీఎం చేసిన వ్యాఖ్యలతో తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు.

ప్రమోషన్ వచ్చినట్టే వచ్చి చేజారే!

- భాషాపండితులకు దక్కని పదోన్నతులు
- 600 మందికి మొండిచెయ్యి
- రోస్టర్ విధానమంటూ పక్కనపెట్టేసిన విద్యాశాఖ

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): వారంతా గ్రేడ్ -2 భాషా పండితులు. తాజా పదోన్నతుల్లో ప్రమోషన్ వస్తుందని కలలు కన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు కూడా హాజరయ్యారు. ఏకంగా పదోన్నతులు పొందిన తర్వాత ఎక్కడ పోస్టింగ్ కావాలో తెలిపేందుకు వెబ్ ఆప్షన్లు సైతం ఇచ్చారు. కానీ ఏం జరిగిందో తెలియదు.. తీరా చూస్తే వారికి పదోన్నతి దక్కలేదు. ఇలాంటి వారు రాష్ట్రంలో ఆరు వందల మందికిపైగా ఉంటారని ఉపాధ్యాయ సంఘాలంటున్నాయి. అధికారుల తీరుతో అందివచ్చిన పదోన్నతి ఆఖరు నిమిషంలో చేజారడంతో వారు తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారు. పీఈటీలకు సైతం ఇదే తీరులో నష్టం జరిగిందని వాపోతున్నారు. టీచర్ల పదోన్నతుల్లో భాగంగా రేవంత్‌రెడ్డి సర్కారు పలువురు గ్రేడ్ -2 భాషాపండితులకు మొండిచెయ్యి చూపింది. రోస్టర్ విధానాన్ని పాటించడంతో ఏకంగా 600 మంది భాషాపండితులు ప్రమోషన్‌కు దూరమయ్యారు.

పోస్టులున్నా.. పదోన్నతులు లేవు

టీచర్ల పదోన్నతుల్లో భాగంగా గ్రేడ్ -2 భాషాపండితులు, పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ కల్పించారు. మల్టీజోన్ -1లో బుధవారం పదోన్నతుల ఉత్వర్వులిచ్చారు. మల్టీ జోన్ -2లో శుక్రవారం రాత్రికి లేదా.. శనివారం పదోన్నతుల ఉత్తర్వులు విడుదలకానున్నాయి. అయితే రోస్టర్ విధానం పేరుతో కొంత మందికి పదోన్నతులిచ్చి, మరికొంత మందిని విద్యాశాఖ పక్కనపెట్టినట్టు ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇది అన్యాయమని, ఏన్నో ఏండ్లుగా పదోన్నతుల కోసం వేచిచూస్తున్న వారిని రోస్టర్ విధానం పేరుతో పక్కనపెట్టడం సరికాదంటున్నాయి. పోస్టులున్నా నింపకపోవడమేంటని ప్రశ్నిస్తున్నాయి. బ్యాక్‌లాగ్‌లో పెట్టడం వల్ల ఉపయోగమేంటని మండిపడుతున్నాయి. దీంతో అప్‌గ్రేడ్ అయిన పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేక బోధన కుంటుపడుతుందని ఉపాధ్యాయ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. ఇదే విషయంపై 'నమస్తే తెలంగాణ' విద్యాశాఖకు చెందిన ఓ ఉన్నతాధికారిని ఫోన్లో సంప్రదించగా స్పందించలేదు.

- **ఖమ్మం జిల్లాలో 16 మంది హిందీ పండితులు, 11 మంది తెలుగు పండితులకు పదోన్నతులు దక్కలేదు.**
- **రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఐదుగురు తెలుగు, ఏడుగురు హిందీ పండితులకు ప్రమోషన్లు చేజారాయి.**
- **సిద్దిపేట జిల్లాలో 178 మంది హిందీ పండితులుంటే 154 మందికి మాత్రమే పదోన్నతి దక్కగా, 24 మంది పదోన్నతికి దూరమయ్యారు. తెలుగులో 17 మందికి పదోన్నతులు దక్కలేదు.**

శ్రీశైలం ఇక ఎడారే!

మొదటిపేజీ తరువాయి...

సమాయత్తమవుతున్నారు. నావలి రిజర్వాయర్‌ను విస్తరిస్తే తెలంగాణకు తీరని నష్టం వాటిల్లుతుందని, శ్రీశైలం ప్రాజెక్టు ఎడారిలా మారే ప్రమాదముందని సాగునీటిరంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర సర్కారు మాత్రం ఈ అంశంపై నోరుమెదపకపోవడం అనేక అనుమానాలను రేకెత్తిస్తున్నది.

'నావలి' ద్వారా నీటి తరలింపు

తుంగభద్ర డ్యామ్‌లో పూడికపెరిగి పూర్తిస్థాయిలో నీటిని వినియోగించుకోలేని పరిస్థితులున్నాయనే సాకుతో ప్రస్తుత లో లెవెల్ కెనాల్ (ఎల్‌ఎల్‌సీ)కు సమాంతరంగా మరో కాలువ తవ్వేందుకు కర్నాటక సర్కారు ప్రణాళికలు వేస్తున్నది. దీంతోపాటు 31 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న నావలి రిజర్వాయర్‌ను 52 టీఎంసీలకు విస్తరించేందుకు సిద్ధమైంది.

బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 230 టీఎంసీల నీటిని వినియోగించుకునే లక్ష్యంతో తుంగభద్ర డ్యామ్ నిర్మించారు. దీనికింద కర్నాటకలో 9,30,626, ఏపీలో 6,25,097, తెలంగాణలో 87వేల ఎకరాల ఆయకట్టు ఉన్నది. డ్యామ్‌లో పూడిక పెరగడంతో పాటు, వరద ప్రవాహాల్లో వచ్చిన మార్పుల ఫలితంగా ఆవిరి నష్టాలతో కలుపుకొని 230 టీఎంసీలు వినియోగించుకోవాల్సి ఉండగా, ప్రస్తుతం 174.72 టీఎంసీలను కూడా వాడుకోలేని పరిస్థితి ఉందని కర్నాటక సాకులు చెబుతూ తాజాగా ఈ ప్రతిపాదనలు ముందుకుతెచ్చింది. మొత్తంగా 55.28 టీఎంసీలను నష్టపోవాల్సి వస్తున్నదని, ఈ నేపథ్యంలోనే కొప్పల్ జిల్లా గంగావతి తాలుకాలో ఉన్న నావలి రిజర్వాయర్‌ను 52 టీఎంసీలకు విస్తరించి తుంగభద్ర డ్యామ్‌కు బ్యాలెన్సింగ్‌గా వినియోగించుకోవాలని ప్రణాళికలు వేసింది. ఎల్‌ఎల్‌సీకి సమాంతరంగా మరో కాలువ తవ్వి తుంగభద్ర వరదను నావలికి తరలించేందుకు వేగంగా అడుగులు వేస్తున్నది.

వచ్చే బోర్డు సమావేశంలో కీలక చర్చ

కర్నాటక ప్రతిపాదనలకు తుంగభద్ర బోర్డు ఆమోదం తప్పనిసరి. ఈమేరకు ఇప్పటికే నావలి రిజర్వాయర్ విస్తరణకు డీపీఆర్‌ను సిద్ధం చేసిన కర్నాటక సర్కారు గత బోర్డు సమావేశంలోనే చర్చకు పెట్టేందుకు యత్నించింది. అయితే డీపీఆర్‌ను ఇవ్వకపోవడంతో బోర్డులోని తెలంగాణ సహా ఇతర రాష్ట్రాలు వ్యతిరేకించాయి. ఈ నేపథ్యంలో తాజాగా బోర్డులోని రాష్ట్రాలకు నావలి రిజర్వాయర్ విస్తరణ డీపీఆర్‌ను కర్నాటక పంపింది. త్వరలో నిర్వహించే బోర్డు సమావేశంలో దీనిపై చర్చించేందుకు కర్నాటక సర్కారు సమాయత్తమవుతున్నది.

తెలంగాణకు తీరని నష్టం..

కర్నాటక ప్రతిపాదనలు అమలైతే తెలంగాణకు తీరని నష్టం వాటిల్లనుంది. కృష్ణా నదికి తుంగ, భద్ర ఉపనదులు. ఈ రెండింటి నుంచే ఏటా దాదాపు 500 టీఎంసీల మేరకు జలాలు కృష్ణా నదిలోకి వస్తుంటాయి. ఈ నేపథ్యంలోనే బచావత్ ట్రిబ్యునల్ తుంగభద్ర నదిపై ఎక్కడ పడితే అక్కడ, ఎలా పడితే అలా ప్రాజెక్టులు నిర్మించకుండా అనేక ఆంక్షలు విధించింది. కానీ కర్నాటక సర్కారు ఇప్పటికే ఆ నిబంధన లు తుంగలో తొక్కుతూ నిర్మాణాలు చేపడుతున్నది. ఇప్పుడు ఏకంగా నావలి, కొత్తగా మరికొన్ని బరాజ్‌ల నిర్మాణానికి పూనుకుంది. అదే జరిగితే భవిష్యత్‌లో తుంగభద్ర నుంచి కృష్ణాలోకి జలాల రాక పూర్తిగా తగ్గిపోతుంది. ఫలితంగా కృష్ణా జలాలపై ఆధారపడ్డ తెలంగాణకు తీరని నష్టం జరుగుతుందని ఇంజినీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు జలాలు రావడమే గగనమని, ప్రాజెక్టు ఎడారిలామారే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు.

నాడు వ్యతిరేకించిన బీఆర్‌ఎస్ సర్కారు

కర్నాటక సర్కారు ప్రతిపాదనలను ఆదిలోనే నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ద్వంద్వంగా వ్యతిరేకించింది. నావలి రిజర్వాయర్ విస్తరణ ప్రతిపాదనలకు అంగీకరించాలని కోరుతూ 2022లో కర్నాటక సర్కారు ప్రతిపాదించింది. ఇది తెలంగాణ ప్రయోజనాలకు తీరని నష్టమని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కర్నాటకకు తేల్చిచెప్పి, ఆ ప్రతిపాదనలను తోసిపుచ్చింది. ట్రిబ్యునల్-2 అవార్డు అమల్లోకి వచ్చేదాకా ఆ ప్రాజెక్టుపై ముందుకుపోవద్దని తుంగభద్ర బోర్డు మీటింగ్‌లోనూ స్పష్టంచేసింది. బచావత్ ట్రిబ్యునల్ తుంగభద్రపై అనేక షరతులు విధిస్తూ 230 టీఎంసీలను కేటాయించిందని గుర్తుచేసింది. ట్రిబ్యునల్-2 అవార్డు వచ్చేదాకా తుంగభద్ర బేసిన్‌లో కొత్త ప్రాజెక్టులేవీ చేపట్టవద్దని కరాఖండిగా తేల్చిచెప్పింది.

నేడు కాంగ్రెస్ సర్కారు మౌనం

నావలి రిజర్వాయర్ విస్తరణ కోసం ప్రణాళికలు సిద్ధమయ్యాయని కర్నాటక డిప్యూటీ సీఎం, ఇరిగేషన్ మినిస్టర్ డీకే శివకుమార్ బాహటంగా ప్రకటించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలతో చర్చించి వచ్చే బడ్జెట్‌లోనే ఈ ప్రాజెక్టును అమలు చేస్తామని గత ఫిబ్రవరిలోనే వెల్లడించారు. ఇదే విషయాన్ని అసెంబ్లీ వేదికగా ఏఐఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఓవైసీ ప్రస్తావించడంతోపాటు, కర్నాటకను అడ్డుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సత్వరమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నావలి రిజర్వాయర్ విస్తరణ అంశాన్ని తాజాగా కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్వయంగా ప్రకటించారు. అయినా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఈ అంశంపై నోరుమెదపడం లేదు. కర్నాటక సర్కారు పెద్దలు తెలంగాణ ప్రభుత్వ పెద్దలతో గుట్టుగా మంతనాలు సాగిస్తున్నారని తెలిసింది. అందుకే ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం మౌనం వహిస్తున్నదని సాగునీటి రంగ నిపుణులు, ఇంజినీర్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నావలి రిజర్వాయర్ విస్తరణను వ్యతిరేకించాలని డిమాండ్ చేస్తున్నారు. నావలి రిజర్వాయర్ విస్తరణనే గాకుండా తుంగభద్రపై రాయచూరు జిల్లాలోని చిక్కమంచాల సమీపంలో బ్రిడ్జి కమ్ బరాజ్ కట్టాలని, మంత్రాలయం రోడ్డు మార్గాన్ని కూడా అనుసంధానించాలని కర్నాటక నిర్ణయించింది. ఇందుకు ఏకంగా గత బడ్జెట్‌లోనే రూ.158 కోట్లు ప్రతిపాదించింది. దీనిపైనా తెలంగాణ కాంగ్రెస్ సర్కారు ఇప్పటివరకు స్పందించిన దాఖలాల్లేకపోవడం గమనార్హం.

కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఏఐ ఆధారిత మ్యాట్‌ను అందిస్తున్న స్టార్టప్ ప్రతినిధులు

యోగాకు 'ఏఐ' మ్యాట్

ఐఐటీ మండి ఆధ్వర్యంలోని ఒక స్టార్టప్ అభివృద్ధి చేసిన కృత్రిమ మేధ ఆధారిత యోగా మ్యాట్‌ను కేంద్ర మంత్రులు ఎస్ జయశంకర్, అశ్వినీ వైష్ణవ్, నిర్మలా సీతారామన్‌లకు కేంద్ర సైన్స్, టెక్నాలజీ మంత్రిత్వ శాఖ తరపున అందజేశారు. 'యోగిఫై'గా వ్యవహరించే ఈ మ్యాట్ ఇంట్లోనే యోగా అభ్యాసం, శిక్షణను సులభతరం చేస్తుంది. ప్రపంచంలో ఎక్కడున్నా దీని ద్వారా వ్యక్తిగత శిక్షణ పొందవచ్చునని దీనిని అభివృద్ధి చేసిన వెల్‌నెసీస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వెల్లడించింది.